క్లుప్తంగా

అదుపుతప్పి బోల్తా పడిన బొగ్గులారీ



నడికూడ : మండల కేంద్రంలోని మహమ్మద్ షా నల్లమాటు వాగు సమీపంలో శనివారం ఉదయం భూపాలపల్లి నుంచి ఉప్పల్‌కు బొగ్గు లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పండింది. పొలం పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్ద గల చెట్టుకి ఆనుకోని పడిపోగా లారీ డ్రైవర్ రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పరకాల పోలీసులు తెలిపారు. కాగా ఇప్పటికైనా అధికారులు స్పందించి పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారికి ఆనుకుని పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్న బావుల వద్ద రక్షణగా గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

డిక్షనరీలు, క్రీడా పరికరాల పంపిణీ



ఐనవోలు : మండలంలోని పంథిని ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ, కాకతీయ ఆధ్వర్యంలో దాత రేవూరి రమణారెడ్డి 6,7వ తరగతి విదార్థులకు మినీ డిక్షనరీ, స్టడీ మెటీరియల్, 10 విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పాఠశాలకు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాట్స్, క్యారం బోర్డు, టెన్నికాయిట్ తదితర క్రీడా వస్తువులను శనివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ పులి ఆనందం హాజరై దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ యాదవరెడ్డి, మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పంపిణీ

శాయంపేట : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన బాసాని కైలాసాం–కనకలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు బాసాని జయప్రకాశ్ ఆల్‌ఇన్ వన్ బుక్స్, పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందజేయగా జయప్రకాశ్ సోదరుడు, రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ సభ్యుడు చంద్రప్రకాశ్ శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు మండలంలో మొదటి ర్యాంకు సాధిస్తే రూ. 5వేల నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. సదానందం, మాజీ సర్పంచ్ రవి, బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, చంద్రమౌళి, కుమారస్వామి పాల్గొన్నారు.

డీబీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



దామెర : మండల కేంద్రంలో డీబీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా బాగాది కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా గోవిందు అనిత, ఉపాధ్యక్షులుగా గరిగే గౌతమ్, చిలువేరు అనిల్, కార్యదర్శులుగా కుమారస్వామి, విజయ, సభ్యులుగా భిక్షపతి, మానస, పుష్పలత, రవిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు మెచ్చిన మన భారత రాజ్యాంగాన్ని మనువాదుల చెర నుంచి రక్షించుకోవాలని, దేశంలో దళితులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను అరికట్టాలని, దళితుల కోసం తీసుకువచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు విజేందర్, రాధ, కర్ణాకర్, సంపూర్ణ, అనిత, విజయ, సారయ్య, సాంబయ్య, కట్టయ్య పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డిని గెలిపించాలి



శాయంపేట : వరంగల్, నల్లగొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు జన్నె మొగిలి కోరారు. శనివానం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సరోత్తం రెడ్డి గెలుపు కోరుతూ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వమించి ఓట్లను అభ్యర్థించారు. ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, నాయకులు నాగరాజు, రాజు, శివ ఉన్నారు.

కోర్కెలు తీర్చే కోరమీసాల మల్లికార్జునుడు



గట్టు మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గట్టు మల్లన్నకు పెద్దపట్నం వేస్తున్న ఒగ్గు కళాకారులు, అర్చకులు

- గట్టు మల్లన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె
- మహాశివరాత్రికి శివపార్వతుల కల్యాణం
- ఉగాదికి పంచాంగ శ్రవణం
- వేల సంఖ్యలో హాజరుకానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గుట్టపై ఉన్న గట్టు మల్లికార్జున స్వామి పూజలు అందుకుంటున్నాడు. ప్రతీ ఏడాది మహాశివరాత్రి పర్వదినం నుంచి ఉగాది వరకు జరిగే జాతరకు గట్టు మల్లన్నను దర్శించుకునేందుకు భక్తులు నిత్యం వేల సంఖ్యలో వస్తుంటారు. ఈసారి జాతరకు ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గట్టు మల్లికార్జున స్వామి మహిమగల దేవుడని భక్తుల అపార నమ్మకం. గుట్టపైన ఉన్న ధర్మగుండంలో స్నానాలు ఆచరించి గుండంలోని నీటిని తీసుకువెళ్లి రైతులు తమ పంటపొలాలు, పాడిపశువులపై చల్లితే బాగుంటాయని ప్రజలు విశ్వసిస్తుంటారు. దీంతో మండలంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు.

ఆలయ స్థల పురాణం...

ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన గొర్రెలకాపరి ఏళబోయిన కొమురయ్య గొర్రెలు మేపేందుకు గుట్ట పరిసర ప్రాంతంలోని అడవిలోకి వెళ్లాడు. గుట్టపైకి వెళ్లిన కొమురయ్య గొర్రెలు ఒక్కసారిగా మాయమైపోతాయి. మాయమైన గొర్రెలను వెతికి అలసిపోయి ఓచెట్టు కింద సేద తీరుతుండగా ఆయన కలలో మల్లికార్జున స్వామి ప్రత్యక్షమై గుట్టపైన దుద్దిళ్లపొగ వచ్చే చోట తాను కొలువై ఉన్నట్లు, ఆ చోటనే దేవుళ్ల ప్రతిమలు కనిపిస్తాయని కొమురయ్యకు చెప్పి మాయమవుతాడు. దీంతో కొమురయ్య వెంటనే గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయం గ్రామస్తులకు చెప్తాడు. కొంత మంది యాదవులు గుట్టపైకి వెళ్లి చూడగా పెద్దబండరాళ్ల మధ్య ఉన్న పుట్టలోంచి దుద్దిళ్లపొగ వస్తుంది. అందులో గట్టుమల్లికార్జున స్వామితో పాటు ఇతర దేవుళ్ల ప్రతిమలు కూడా కనిపించినట్లు గ్రామస్తులు చెబుతుంటారు. దీంతో అక్కడ పూజలు చేసి తిరిగి వస్తుంటే మాయమైన గొర్రెలు ఎదురుగా ప్రత్యక్షమైనట్లు నాటి పూర్వికులు అంటుంటారు. నాటి నుంచి మల్లికార్జున స్వామిని ఇక్కడి యాదవులు కులదైవంగా పూజిస్తున్నారు.



గుట్టపైన ఉన్న ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రేమకు ప్రతిరూపం గట్టు మల్లన్న

గట్టు మల్లన్నకు ఆరుగురు సోదరులు. అందులో అందరికంటే చిన్నవాడైన గట్టు మల్లన్న అంటే మిగితా సోదరులకు అమితమైన ప్రేమ. మల్లన్న సోదరుల్లో ఐలోని మల్లన్న, కొమురవెల్లి మల్లన్న, ఓదెల మల్లన్న, దుబ్బ మల్లన్న, కట్ట మల్లన్న తర్వాత గట్టు మల్లన్న చిన్నవాడు. గుట్టపై దేవుళ్ల ప్రతిమలు ఉన్న విషయాన్ని యాదవులు ఆనాటి రాజుకు వివరించగా దేవుళ్లు వెలిసిన చోట ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర తెలుపుతోంది. ఆలయంలో ప్రతీరోజు అర్చకులు పూజలు చేస్తుండగా యాదవులు ఒగ్గు కథలు చెబుతూ పట్నాలు వేస్తున్నారు. గట్టు మల్లన్నను పూజిస్తే సకల కష్టాలు దూరమవుతాయని, కుటుంబాలు పిల్లాపాపలతో సంతోషంగా ఉంటాయని వేల సంఖ్యలో భక్తులు నిత్యం వచ్చి బోనాలు సమర్పించి పట్నాలు వేస్తున్నారు.

ధర్మగుండంలో స్నానాలు చేస్తే మేలు

గట్టపై ఉన్న ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తే మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. గుండంలోని నీటిని రైతులు తీసుకువెళ్లి తమ పంటపొలాలపై, పాడిపశువులపై చల్లుకుంటారు. అలాగే వ్యాధుల బారిన పడినవారు గుండంలో స్నానం చేస్తే వ్యాధులు నయమైతాయని భక్తుల విశ్వాసం. ఆలయంలో ఒగ్గు పూజారులు ప్రత్యేక పట్నాలు వేసి ఒగ్గు కథలతో మల్లన్నను కొలుస్తారు. అలాగే ఆలయం ముందున్న దీపంలో నూనెపోస్తే గండాలు తప్పుతాయని నమ్మకం. గతంలో మహాశివరాత్రి నుంచి ఉగాది వరకు మాత్రమే పూజలు నిర్వహించేవారు. కానీ 15 ఏళ్లగా ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయి. గతంలో కంటే అభివృద్ధి కూడా బాగానే జరిగినట్లు భక్తులు తెలుపుతున్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం



మహాశివరాత్రి నుంచి ఉగాది వరకు నిర్వహించే జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నాం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈసారి ప్రభుత్వం జాతర కమిటీని నియమించలేదు. దీంతో అన్ని శాఖల అధికారుతో సమన్వయం చేసుకుంటూ జాతరను విజయవంతం చేస్తాం. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం రుద్రహోమం, సాయంత్రం శివపార్వతుల కల్యాణం, రాత్రి స్వామి వారికి పెద్దపట్నం వేస్తాం. గట్టు మల్లన్న జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దేవుడి ఆశీర్వాదం పొందాలని భక్తులను కోరుతున్నాం.

– నాగేశ్వరరావు,
ఆలయ కార్యనిర్వహణాధికారి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

పరకాల : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం విద్యార్థులు శనివారం గణపురంలోని కోటగుళ్లను సందర్శించారు. కాకతీయ రాజు వంశంలోని గణపతిదేవుడు పరిపాలనలో ఎంతో అద్భుతంగా నిర్మాణం చేయబడిన కోటగుళ్లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయని చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లయ్య తెలిపారు. కోటగుళ్లలో గణపేశ్వరాలయంతో పాటు 22 ఇతర శైవదేవాలయాలు ఉన్నాయని, వాటిని పునరుద్ధరించినట్లయితే కాకతీయ రాజుల వారసత్వ సంపదను కాపాడుకోవడమే కాకుండా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పర్యాటక ప్రాంతమైన రామప్పకు కోటగుళ్లు 10 కిలో మీటర్ల దూరంలో ఉండటం వలన భవిష్యత్‌లో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు.



కోటగుళ్లను సందర్శించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మత్స్యగిరి జాతరకు విద్యుత్ సౌకర్యం

శాయంపేట : మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి జాతర మే నెలలో జరుగనుంది. ఈ సందర్భంగా మత్స్యగిరి గుట్ట వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఆ శాఖ ఏఈ చందూలాల్‌తో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ చందూలాల్ మాట్లాడుతూ.. జాతర ప్రాంగణంలో ఐదు విద్యుత్ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. దీంతో మత్స్యగిరి స్వామి జాతర సమయంలో విద్యుత్ సమస్య తీరనుందని, భక్తులకు జాతర ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బంది ఉండదని చైర్మన్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్‌ను పరకాల ఆర్డీఓ నారాయణ శనివారం పరిశీలించారు. ఈనెల 27వ తేదీన జరుగనున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఓటర్లు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వరలక్ష్మీ దేవి, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



దామెర : ఎన్నికల బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ నారాయణ



వేలేరు : మాట్లాడుతున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్

టీచర్స్ ఎమ్మెల్సీ బూత్‌ను పరిశీలించిన ఆర్డీఓ నారాయణ

శాయంపేట : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్‌ను పరకాల ఆర్డీఓ నారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీన జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శాయంపేట బూత్‌లో 69మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుంగా చూడాలని అన్నారు. విద్యుత్ సౌకర్యం, తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యం, వికలాంగులకు వీల్ చైర్‌తో పాటు ఇద్దరు సిబ్బందిని నియమించాలని తెలిపారు. ఓటర్లు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రమేశ్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ ఉన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వొద్దు

నడికూడ : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లోనవ్వకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని పరకాల ఆర్డీఓ కణ్ణం నారాయణ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు అనవసరంగా భయం, ఒత్తిడికి లోనవ్వొద్దని సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఎఓ పోరిక జైసింగ్, ఎంఈఓ హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గట్టు మల్లిఖార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ రమేశ్ రాథోడ్ అన్నారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. పోలీస్ శాఖ అధికారులు జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అన్నారు. వైద్యశాఖ అధికారులు జాతర ముగిసే వరకు 108 అంబులెన్స్, మందులు, ఇతర అత్యవసర పరికరాలను అందుబాటలో ఉండేలా చూసుకోవాలని అన్నారు. విద్యుత్ అధికారులు కరెంట్ అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. పంచాయతీ అధికారులు జాతరలో సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఈఓ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ కుమారస్వామి, పీహెచ్‌సీ డాక్టర్ మేఘన, ఎంపీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ఆత్మకూరు : మండల కేంద్రంలో బీరప్ప, మహాకాళి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేదపండితులు శివకిరణ్ శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని పూజలు నిర్వహించారు.

రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలి

సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండల కేంద్రంలోని గొల్లపల్లి రోడ్యాంపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు అంటించకుండా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారు. దీంతో శనివారం సాక్షి దినపత్రిక 'ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా' కథనం ప్రచురించింది. స్పందించిన పంచాయతీరాజ్ ఏఈ ఉదయ్ కుమార్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం జరిగే ప్రదేశంలో హెచ్చరిక, సూచిక బోర్డులు, లైట్లు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.



కాంట్రాక్టర్‌కు సూచనలు చేస్తున్న ఏఈ ఉదయ్ కుమార్

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను వంచించిందని విమర్శించారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆరోపించారు. ఈనెల 27వ తేదీన జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికంగా ఏకగ్రీవం అయ్యేలా చూడాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఉత్సాహంగా వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, 10వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తరగతి గదుల్లో చేసిన అల్లరి, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ రజని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఈఓ భిక్షపతి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి ర్యాంకులు సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి అసెంబ్లీ మొదలు రోజువారి తరగతులు, ప్రయోగశాలలో ప్రయోగాలు చేయించారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, మైదానంలో క్రీడలు, విద్యార్థులకు స్లిప్ టెస్టులతో మూల్యాంకనం చేశారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో ఉపాధ్యాయులుగా తమ పాత్ర పోషించిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్ మాట్లాడుతూ.. పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు మంచి బోధన పటిమను ప్రదర్శించారని ఆర్జేడీ, డీఈఓ, ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు పాఠశాల పాలన వ్యవహారాలను బాధ్యతతో నిర్వహించడంతో వారంతా భవిష్యత్ పౌరులుగా పట్టుదలతో నిర్వహించే అవకాశం కలిగిందని అన్నారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు

జాతరకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు

- దేవస్థానం చైర్మన్ రాజేశ్వర్‌రావు

పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే వేలాది మంది భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు తెలిపారు. దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లను సీఐ క్రాంతికుమార్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి ఏడాది దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తుల రద్దీ పెరుగుతున్న కారణంగా ముందు జాగ్రత్తగా, ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఐని కోరారు. భక్తులు సంయవనం పాటించాలని కోరారు. జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, అర్చకుడు వినయ్‌శర్మ పాల్గొన్నారు.



మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, దేవస్థానం చైర్మన్

ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇప్పించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతి

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో కరీంనగర్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇప్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం బండి సంజయ్‌ని కరీంనగర్‌లోని తన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాతో పాటు హుజూరాబాద్, పరకాల, కమలాపూర్ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉన్న ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారని, ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో కరీంనగర్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఉప్పల్‌లో కరీంనగర్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ లేకపోవడంతో ప్రయాణికులు అనేక వ్యయ, ప్రయాసలకోర్చుకుని ఇతర రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని బండి సంజయ్‌కు వివరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి బండి సంజయ్ ఈ విషయాన్ని రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉప్పల్‌లో కరీంనగర్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ ఇప్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. బండిని కలిసిన వారిలో నాయకులు తోట సురేశ్, భూపతి ప్రవీణ్, వేముల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మంత్రి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 5బంగారు పతకాలు, 7 వెండి పతాకాలు, 8 కాంస్య పతకాలు సాధించి విజయ దుందుంభి మోగించారు. ధరణి, వర్షిని, సాత్విక, రచన, విశ్వశ్రీ బంగారు పతకాలు సాధించగా, మరో ఏడుగురు వెండి పతకాలు, 8మంది కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజని తెలిపారు. విద్యార్థినులను వైస్ ప్రిన్సిపాల్ సుమలత, పీఈటీ స్రవంతి, రోహిణి అభినందించినట్లు తెలిపారు.



తెక్వాండోలో పతకాలు సాధించిన విద్యార్థులు